యాదగిరిగుట్టలో ప్రధాన ఆలయం ఎదుట ఉత్తర ద్వార దర్శనం ఏర్పాట్లు

నేడు యాదగిరిగుట్టలో ముక్కోటి ఏకాదశి

ఉత్తర ద్వారం గుండా వైకుంఠనాథుడిగా స్వామివారి దర్శనం

యాదగిరిగుట్ట, డిసెంబర్ 22: యాదగిరిగుట్టలో శనివారం వైకుంఠ(ముక్కోటి) ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం 6:48 గంటలకు ప్రధానాలయంలో స్వామివారు ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిస్తారు. పాతగుట్ట లక్ష్మీనారసింహుడు ఉత్తర రాజగోపురం గుండా 6:42 గంటలకు వైకుంఠనాథుడిగా దర్శనం ఇవ్వనున్నారు. ఆలయ చరిత్రలో యాదగిరీశుడు ఉత్తర ద్వారం గుండా భక్తులకు రెండోసారి దర్శనమివ్వనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసినట్టు ఆలయ ఇన్‌చార్జి ఈవో రామకృష్ణారావు వెల్లడించారు. ఉత్తర ద్వారం ఎదురుగా భక్తులు స్వామివారిని దర్శించుకునేలా ప్రత్యేక ఇత్తడి క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయ వేళల్లో మార్పులు చేసినట్టు చెప్పారు. స్వామివారి బ్రేక్ దర్శనం ఉదయం 9 గంటలకు ఉండగా.. ఆ సమయాన్ని 11 గంటలకు మార్చినట్టు వెల్లడించారు. భక్తులతో నిర్వహించే పలు కార్యక్రమాలను రద్దుచేశారు.

తిరుమలలో పోటెత్తిన భక్తులు

- **ఉత్తర ద్వార దర్శనానికి భారీగా వీఐపీల రాక**

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): వైకుంఠ ఏకాదశి వేళ తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. వీఐపీలు భారీ సంఖ్యలో తిరుమలకు తరలివస్తున్నారు. అంచనాలకు మించి భక్తులు వస్తుండటంతో టోకెన్లు లేని వారిని క్యూ లైన్లలోకి టీటీడీ అధికారులు అనుమతించడంలేదు. శనివారం తెల్లవారుజామున 1.45 గంటలకు ఉత్తర ద్వారం తెరచుకున్నది. రోజుకు 80 వేల మంది భక్తులకు వైకుంఠ దర్శనం కల్పించేలా టీటీడీ ఏర్పాట్లు చేసింది. జనవరి 1 వరకు శ్రీవారి వైకుంఠ ద్వార సర్వదర్శనం కల్పించనున్నారు. ఈ నెల 27న వైకుంఠ ద్వార దర్శనం కోసం ఆఫ్‌లైన్ టికెట్లు శుక్రవారం మధ్యాహ్నం నుంచి పంపిణీ చేస్తామని అధికారులు ముందుగా ప్రకటించడంతో భక్తులు గురువారం సాయంత్రం నుంచే భారీ సంఖ్యలో క్యూ కట్టారు. దీంతో గురువారం అర్ధరాత్రి నుంచే టోకెన్లు పంపిణీ చేశారు. ఐదుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో పాటు వివిధ హైకోర్టుల నుంచి 35 మంది జడ్జిలు, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శ్రీవారి దర్శన జాబితాలో ఉన్నారు. పెద్ద సంఖ్యలో వస్తున్న ప్రముఖులకు వసతి కల్పించడం అధికారులకు సమస్యగా మారింది.

శ్రీశైలంలో స్పర్శ దర్శనం

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): శ్రీశైలం ఆలయంలో ఆర్జిత అభిషేకాలను మూడు రోజుల పాటు నిలిపివేయనున్నట్టు దేవస్థానం ఈవో డీ పెద్దిరాజు వెల్లడించారు. శనివారం వైకుంఠ ఏకాదశి, ఆదివారం వారాంతపు సెలవు కారణంగా భక్తుల రద్దీ దృష్ట్యా ఈ నెల 23, 24, 25 తేదీల్లో గర్భాలయ, సామూహిక అభిషేకాలు నిలిపివేయనున్నట్టు తెలిపారు. ఆర్జిత అభిషేకాలకు ప్రత్యామ్నాయంగా మల్లికార్జునస్వామి స్పర్శ దర్శనానికి అనుమతిస్తామని పేర్కొన్నారు. రోజూ నాలుగు విడతల్లో స్పర్శ దర్శనానికి అవకాశం ఇస్తామని,. దేవస్థానం వెబ్‌సైట్ ద్వారా టికెట్లు పొందాలని సూచించారు.

పార్లమెంట్‌ను రక్షించలేనోళ్లు..

దేశ ప్రజలను రక్షిస్తారా?

హైదరాబాద్‌లోని ధర్నాచౌక్ వద్ద పీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి

- **పార్లమెంట్‌పై దాడి ముమ్మాటికీ ప్రజాస్వామ్యంపై దాడే..**
- **141 మంది ఎంపీలను సస్పెండ్ చేయడం సిగ్గుచేటు**
- **ఇందిరా పార్క్ ధర్నాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**
- **కాంగ్రెస్ ధర్నాలో మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు**

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): భారత పార్లమెంట్‌నే రక్షించలేని వాళ్లు, దేశ ప్రజలను ఎలా రక్షిస్తారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రశ్నించారు. పార్లమెంట్‌పై దాడి ముమ్మాటికీ ప్రజాస్వామ్యంపై దాడేనని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ఇండియా కూటమి ఎంపీలను అప్రజాస్వామికంగా సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. దీనిలోభాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద పీసీసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పార్లమెంట్‌పై అగంతకులు దాడి చేస్తే, సభలో చర్చించాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో సభలో చర్చిద్దామని అడిగితే ఇండియా కూటమి ఎంపీలను సస్పెండ్ చేయడం దారుణమని ఆరోపించారు. దేశ రక్షణను ప్రధాని మోదీ గాలికి వదిలేశారని మండిపడ్డారు. పార్లమెంట్‌పై జరిగిన దాడితో ప్రపంచ దేశాల్లో భారతదేశ కీర్తి ఎంత దిగజారిందో దేశ ప్రజలు ఆలోచించాలని అన్నారు. దేశ చరిత్రలో కనీవిని ఎరగని విధంగా 141 మంది పార్లమెంటు సభ్యులను సస్పెండ్ చేయడం దుర్మార్గమని చెప్పారు. ప్రశ్నిస్తే కేసులు, పార్లమెంట్ నుంచి బహిష్కరణలు.. స్వేచ్ఛ, భావ ప్రకటన లేకుండా నియంతృత్వ పోకడలతో మోదీ పాలన సాగుతుతున్నదని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు దేశ సరిహద్దుల్లో చిన్నచిన్న ఘర్షణలు సృష్టించి దేశ ప్రజల్లో భావోద్వేగాన్ని రగిలించి మళ్లీ అధికారంలోకి రావాలనే యావే తప్ప, ఈ దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడలనే ఆలోచనే బీజేపీకి లేదని విమర్శించారు. భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ చేస్తున్న పోరాటంలో దేశభక్తులు, ప్రజాస్వామికవాదులు, అభ్యుదయవాదులు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తిచేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. పార్లమెంట్‌పై దాడిని ప్రశ్నిస్తే ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం దుర్మార్గమని అన్నారు. పార్లమెంట్‌పై దాడికి ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని అన్నారు. అనంతరం మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, విప్ ఆది శ్రీనివాస్, టీజేఎస్ అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరామ్, ఆప్ కన్వీనర్ సుధాకర్, పీసీసీ మాజీ అధ్యక్షుడు వీ హనుమంతరావు, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి, అంజనీ కుమార్ యాదవ్ తదితరులు మాట్లాడారు.

ప్రతిపక్ష ఎంపీల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

- **సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**

ప్రతిపక్ష ఎంపీల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఇతర వామపక్ష నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వామపక్షాల ఆధ్వర్యంలో హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ప్రజాప్రతినిధులను అణచివేస్తూ బీజేపీ తన మందబలంతో అనేక చట్టాలకు ఆమోదం పొందుతున్నదని విమర్శించారు. బీజేపీ ఎంపీలు నిర్లక్షంగా వ్యవహరిస్తున్నారని, వారికి దేశంపై గౌరవమే లేదని తెలిపారు. పార్లమెంట్‌పై దాడి సమగ్ర వివరాలు బయటికి రావాల్సిన అసవరం ఉన్నదని పేర్కొన్నారు. బాధ్యులకు పాస్‌లు జారీ చేసిన ఎంపీలపై చర్చ జరగకుండా, ప్రశ్నించిన ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గుజరాత్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై అనేక అనుమానాలు ఉన్నాయని, ఈవీఎం యంత్రాలు తారుమారు అయినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు నంద్యాల నర్సింహారెడ్డి, సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకుడు కే గోవర్దన్, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

32 గుంటలకు 2 రూపాయలే!

- **రైతుబంధు పంపిణీలో లీలలు**
- **ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌తో విస్తుపోయిన రైతు**

రైతుబంధు కింద ఖాతాలో రూ.2 పడ్డట్టు రైతు కందుల శ్రీనుకు వచ్చి మెసేజ్

చిలుకూరు, డిసెంబర్ 22: రైతుబంధు పంపిణీ విషయంలో మునుపెన్నడూ లేని రీతిలో రైతుల నుంచి ఫిర్యాదులొస్తున్నాయి. రూపాయి, రెండు రూపాయిలు తమ ఖాతాల్లో జమైనట్టు సెల్‌ఫోన్‌కు మెసేజ్‌లు వస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన కందుల శ్రీనుకు ఇలాంటి అనుభవమే ఎదురైంది. తనకు 32 గుంటల పొలం ఉన్నదని, కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు తనకు రూ.4 వేల చొప్పున జమ అయ్యేదని, ఈసారి రూ.2 మాత్రమే జమైనట్టు సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చిందని కందుల శ్రీను ఆందోళన వ్యక్తంచేశాడు. సంబంధిత అధికారులు స్పందించి తన ఖాతాలో పూర్తిస్థాయిలో రైతుబంధు నగదు జమ అయ్యేలా చూడాలని కోరుతున్నాడు. వాస్తవానికి అందాల్సిన పెట్టుబడి సాయం కంటే చాలా తక్కువ మొత్తంలో పలువురు రైతుల ఖాతాల్లో జమవతున్న విషయాన్ని ఇప్పటికే మీడియా రిపోర్ట్ చేసినప్పటికీ ప్రభుత్వం కానీ, అధికారులు కానీ దీనిపై స్పందించకపోవడం గమనార్హం.

కాంగ్రెస్ మోసం అసెంబ్లీలో బట్టబయలు

- **బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీశ్**

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వ మోసం బట్టబయలైందని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీశ్ ఒక ప్రకటనలో విమర్శించారు. నిరుద్యోగులకు నెలకు రూ.4,000 చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని యూత్ డిక్లరేషన్ సభలో స్వయంగా ప్రియాంకాగాంధీ ప్రకటించారని, రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తాము అలాంటి ఏ హామీ ఇవ్వలేదని అసెంబ్లీలో ప్రకటించడం కాంగ్రెస్ మాట తప్పే నైజానికి నిదర్శమని పేర్కొన్నారు. ఉద్యోగాల నియామకాలపై స్పష్టమైన ప్రకటన చేయకుండా శ్వేతపత్రాల పేరుతో పాలనను తప్పుదోవ పట్టిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాల భర్తీతోపాటు, నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2004 నుంచి 2014 వరకు పదేండ్ల కాంగ్రెస్ హయాంలో కేవలం 12 వేల ఉద్యోగాలను భర్తీ చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ తొమ్మిదిన్నరేండ్ల కాలంలో 1,32,000 ఉద్యోగాలను భర్తీ చేసిందని తెలిపారు.

ఆకాశమంత అదృష్టం!

న్యూఢిల్లీ, డిసెంబర్ 22: ఇటలీకి చెందిన ఓ జంట.. ఇద్దరూ ఒకే రోజు రెండు వేర్వేరు విమానాల్లో ప్రయాణం.. అనుకోని విధంగా రెండు విమానాలకూ ప్రమాదం.. రెండూ కుప్పకూలాయి.. అయితే అదృష్టం వారివైపే ఉన్నట్టుంది.. ఇద్దరూ ప్రాణాలతో బయటపడ్డారు. ఇటలీలో ఇటీవల ఈ ఆశ్చర్యకర ఘటన జరిగింది. స్టెఫానో పిరెల్లి(30), అతడికి కాబోయే భార్య ఆంటోనియెట్టా డెమాసి(22) స్నేహితులతో మధ్యాహ్నం భోజనం చేయడం కోసం రెండు వేర్వేరు విమానాల్లో సనోవాకు బయల్దేరారు. స్టెఫానో రెండు సీట్లున్న ఎయిర్‌క్రాఫ్ట్‌లో ప్రయాణించగా, ఆంటోనియెట్టా మరో విమానంలో బయలుదేరింది. దురదృష్టవశాత్తు ఆ రెండు విమానాలు పరస్పరం 25 మైళ్ల దూరంలో కూలిపోయాయి. ఈ ప్రమాదంలో స్టెఫానోకు ఎలాంటి గాయాలు కాకపోవడం ఆశ్చర్యకరం. ఆంటోనియోకు చిన్న చిన్న గాయాలయ్యాయి. ప్రమాదంలో గాయపడిన పైలట్లను, ఆంటోనియోను రక్షణ సిబ్బంది వెంటనే దవాఖానకు తరలించారు. 'ఆంటోనియెట్టా మొదటిసారి విమానంలో ప్రయాణిస్తున్నది. ఈ రోజు ఎంతో అందంగా ప్రారంభమైంది కానీ ప్రమాదంతో ముగిసింది' అని స్టెఫానో డైలీ మెయిల్‌కు తెలిపారు. తాము ఎయిర్ స్ట్రిప్‌కు వెళ్లేసరికే పొగ, చీకటి అలముకొని ఉన్నాయని, తమ చుట్టూ విద్యుత్తు తీగలు ఉన్నాయని స్టెఫానో తెలిపారు. అయితే ఆ విషయం తమకు తెలిసే సరికే తమ విమానం కూలిపోయిందని వాపోయారు.

బిగ్‌బాస్ విజేత పల్లవి ప్రశాంత్‌కు బెయిల్

నాంపల్లి కోర్టులు, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): బిగ్‌బాస్ సీజన్-7 విజేత గొడుగు పల్లవి ప్రశాంత్‌తోపాటు సోదరుడు గొడుగు మహవీర్ అలియాస్ పరశురాంకు షరతులతో కూడిన బెయిన్ మంజూరయ్యింది. ఈ మేరకు 17వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ సాయిసుధ శుక్రవారం తీర్పును వెలువరించారు. రూ.15 వేల సొంత పూచీకత్తుపై ఇద్దరి చొప్పున జమానత్‌లను కోర్టుకు సమర్పించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. ప్రతి ఆదివారం జూబ్లీ హిల్స్ పోలీస్‌స్టేషన్‌లో హాజరు కావాలని షరతు విధించారు. డ్రైవర్లు శాంతి సాయికిరణ్, అంకిరావులపల్లి రాజుకు బెయిల్ మంజూరు చేశారు. వీరిద్దరూ రూ.5 వేల చొప్పున కోర్టుకు జమ చేయాలని పేర్కొన్నారు. పోలీసులు దాఖలు చేసిన పిటిషన్లను పరిశీలించిన కోర్టు 12 మంది నిందితుల రిమాండ్‌కు ఆదేశించింది. బెయిల్ పిటిషన్లపై వీరందరి తరపు న్యాయవాదులు వాదనలను వినిపించారు. కోర్టు తీర్పును మంగళవారానికి వాయిదా వేసింది.

పల్లవి ప్రశాంత్‌పై కేసు అమానుషం

- **జనగణన వేదిక జాతీయ అధ్యక్షుడు గోసుల శ్రీనివాస్ యాదవ్**

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): బీసీ బిడ్డ, బిగ్‌బాస్ విజేత పల్లవి ప్రశాంత్ ముదిరాజ్ అరెస్టు అమానుషమని జనగణన వేదిక జాతీయ అధ్యక్షుడు గోసుల శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. ప్రశాంత్ అరెస్టును ఖండిస్తూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓ బీసీ బిడ్డ ఎదుగుతుంటే ఓర్వలేకపోతున్నారని పేర్కొన్నారు. అన్నపూర్ణ స్టూడియో వద్ద జరిగిన ఘటనలో ప్రశాంత్ ప్రమేయం లేకున్నా పోలీసులు కేసులు పెట్టి, బెయిల్ ఇవ్వకుండా వేధిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని, ప్రశాంత్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

కేవల్ కిషన్ జాతరను అధికారికంగా నిర్వహించాలి

- **మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్**

హిమాయత్‌నగర్, డిసెంబర్ 22: పోరాట యోధుడు కేవల్ కిషన్ జాతరను అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం నారాయణగూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లా చేగుంట మండలం పోలంపల్లిలో ఈ నెల 26న నిర్వహించే జాతరకు ప్రజల పెద్దసంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసి జాతరను వైభవంగా నిర్వహించిందని, అదే మాదిరిగా జరిపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని కోరారు. అనేక గ్రామాల నుంచి ప్రజలు ఈ జాతరకు తరలివచ్చి ఎండ్ల బండ్లతో ఊరేగింపులు చేసి ఉత్సవాలను జరుపుకుంటూ కిషన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తారని వివరించారు.

పేపర్లు ఆరు.. పరీక్షలు ఏడు!

- **పదోతరగతి పరీక్షల్లో కీలక మార్పులకు అవకాశం**
- **వేర్వేరుగా జీవశాస్త్రం, భౌతిక శాస్త్రం ఎగ్జామ్స్ నిర్వహణ!**
- **ఏడు రోజులు పరీక్షలు జరిగే చాన్స్**
- **ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించిన ఎస్సీఈఆర్టీ**

పరీక్షలు ఇలా..

- సైన్స్ మినహా అన్ని పేపర్లకు 80 మార్కుల పరీక్ష నిర్వహిస్తారు. 20 మార్కులకు ఇంటర్నల్స్ ఉంటాయి.
- భౌతికశాస్త్రం, జీవశాస్త్రం పేపర్లను 40 మార్కులు చొప్పున మొత్తం 80 మార్కులకు నిర్వహిస్తారు.
- పరీక్షా సమయం అన్ని పేపర్లకు 3 గంటలు ఉంటుంది. ఈ లెక్కన భౌతిక శాస్త్రం, జీవశాస్త్రాలకు 1 : 30 గంటలు పాటు పరీక్షా సమయం ఉంటుంది. అయితే పరీక్షలు మాత్రం వేర్వేరు రోజుల్లో నిర్వహిస్తారు.
- సైన్స్‌లోని రెండు పేపర్లలో ఒక్కో పరీక్షకు ఉదయం 9 : 30 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించనుండగా, ఉదయం 10 : 45 గంటలకు పార్ట్ -బీ పేపర్ (బిట్ పేపర్) ఇస్తారు.
- మిగిలిన పేపర్లకు మెయిన్ పరీక్షను ఉదయం 9:30 గంటల నుంచి 12:30 గంటల వరకు నిర్వహించి, బిట్ పేపర్‌ను 12:15 గంటల సమయంలో ఇస్తారు.

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ఈ ఏడాది పదోతరగతి వార్షిక పరీక్షల్లో కీలక మార్పులు చోటుచేసుకోనున్నట్టు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. ఆరు పేపర్లకు.. ఏడు రోజుల పాటు పరీక్ష నిర్వహించే అవకాశం ఉన్నదని పేర్కొన్నాయి. ప్రధాన సైన్స్ పరీక్షలో అంతర్భాగమైన భౌతికశాస్త్రం, జీవశాస్త్రం పేపర్లను వేర్వేరు రోజుల్లో నిర్వహించే అంశం ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నది. ఈ ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలిపితే ఆరు పేపర్లకు ఏడు రోజుల పాటు పరీక్షలు నిర్వహిస్తారు. రెండేండ్ల క్రితం పదో తరగతి పరీక్షా పేపర్లను 11 పేపర్ల నుంచి 6 పేపర్లకు కుదించారు. అయితే సైన్స్‌లో జీవశాస్త్రం, భౌతిక రసాయన శాస్త్రాలను వేర్వేరు సబ్జెక్టులున్నాయి. ఈ రెండింటిని ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లు బోధిస్తారు. అన్ని సబ్జెక్ట్‌లకు ఒకే సమాధాన పత్రాన్ని ఇవ్వనుండగా, ఒక్క సైన్స్ పేపర్‌కు మాత్రం రెండు ప్రశ్నపత్రాలు, రెండు జవాబు పత్రాలిస్తున్నారు. జీవశాస్త్రం, భౌతికరసాయనశాస్త్రాల ఉపాధ్యాయులిద్దరు జవాబు పత్రాలను మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. 40 మార్కులకు భౌతిక, మరో 40 మార్కులకు జీవశాస్త్రం పేపర్లకు పరీక్షను ఒకే రోజు నిర్వహించడంతో కాస్త గందరగోళానికి దారితీస్తుంది. విద్యార్థులు కూడా సరిగ్గా సన్నద్ధంకాలేకపోతున్నారు. దీంతో సైన్స్ పేపర్లకు రెండు రోజుల పాటు పరీక్షలు నిర్వహించాలన్న విజ్ఞప్తులొచ్చాయి. ఈ నేపథ్యంలో ఎస్సీఈఆర్టీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది.

5 లక్షలకు పైగా విద్యార్థులు

ఈ ఏడాది పదోతరగతి వార్షిక పరీక్షలు రాసేందుకు 5.03 లక్షల మంది విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించారు. పరీక్షల నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ ఒక పూట ప్రత్యేక తరగతులను ప్రారంభించింది. జనవరి నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు పూటలా ప్రత్యేక తరగతులుంటాయి.

భాషాపండిత వ్యవస్థను రద్దుచేయాలి: ఆర్‌యూపీపీటీ

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): పాఠశాల విద్యలో భాషాపండిత వ్యవస్థను రద్దుచేయాలని ఆర్‌యూపీపీ -తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో సంఘం నేతలు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎఫ్‌ఎల్‌ఎన్, ఉన్నతి కార్యక్రమాలను రద్దుచేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి గుళ్లపల్లి తిరుమల కాంతికృష్ణ, కోశాధికారి వీఎస్‌ఎస్‌శర్మ, విజయభాస్కర్, హమీద్‌ఖాన్, ఇస్మాయిల్, రోహిత్‌కుమార్, దినకర్, ఎఫ్‌ఎస్ అలీ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ముందడుగు: బుర్రా వెంకటేశం

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): విద్యతోనే సమాజంలో ముందడుగు సాధ్యమని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం అన్నారు. సచివాలయంలో శుక్రవారం ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు మూడు నెలల పాటు నిర్వహించే ప్రేరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. శాస్త్రీయ ప్రణాళిక, పునశ్చరణతో పరీక్షల్లో విజయం సాధించవచ్చని తెలిపారు. ప్రేరణ వివరాలకు 99893 10141 నంబర్‌ను సంప్రదించాలని నిర్వాహకుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ సూచించారు.

15వేల పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలి: రావుల

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): మెగా డీఎస్సీ నిర్వహిస్తామని హామీనిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 15 వేల పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయాలని డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రావుల రామ్మోహన్‌రెడ్డి కోరారు. టీచర్ల బదిలీలు, పదోన్నతులతో సంబంధం లేకుండా మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే జారీ అయిన 5,089 పోస్టులకు అనుబంధంగా 15 వేల తో కొత్త నోటిఫికేషన్‌ను రిలీజ్ చేయాలని ఒక ప్రకటనలో కోరారు.

బాలికపై లైంగికదాడి కేసులో వ్యక్తికి 60 ఏండ్ల జైలు

నీలగిరి, డిసెంబర్ 22: బాలికపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడిన వ్యక్తికి 60 ఏండ్ల జైలు శిక్ష విధించడంతోపాటు.. ప్రభుత్వం బాధితులకు రూ.10 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని నల్లగొండ జిల్లా పోక్సో, మొదటి అదనపు సెషన్స్ కోర్టు జడ్జి తిరుపతి శుక్రవారం తీర్పు చెప్పారు. నల్లగొండ పట్టణ శివారులోని ఓ గ్రామానికి చెందిన బాలిక(11)పై అదే గ్రామానికి చెందిన నిజాముద్దీన్ అలియాస్ నిజ్జు అలియాస్ విజ్జు(36) పలుమార్లు లైంగిక దాడి చేయడంతో గర్భం దాల్చింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నల్లగొండ రూరల్ ఎస్సై కంచర్ల భాస్కర్‌రెడ్డి, టూటౌన్ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసి ఆధారాలు సేకరించి కోర్టులో సమర్పించారు. బాధితురాలి తరపున జిల్లా మొదటి అదనపు సెషన్స్ కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరిగిరి వెంకట్‌రెడ్డి వాదించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి 60 ఏండ్ల జైలు శిక్షతోపాటు రూ.60 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు. వివరాలు సేకరించి త్వరలోనే కేసు విచారణ పూర్తి చేసిన టూటౌన్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, ఎస్సై కంచర్ల భాస్కర్‌రెడ్డి, కోర్టు డ్యూటీ కానిస్టేబుల్ సురేశ్‌ను నల్లగొండ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి సన్మానించారు. నిందితుడు నిజాముద్దీన్ భార్య వేరుగా ఉంటున్నది.

'చిరుధాన్యాలతో ఆహార సార్వభౌమత్వం'పై నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న డీడీఎస్ డైరెక్టర్ డాక్టర్ రుక్మిణిరావు

చిరుధాన్యాల సాగుతో ఆహార భద్రత

'డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ' సదస్సులో మహిళా రైతుల ఉద్ఘాటన

జహీరాబాద్, డిసెంబర్ 22: చిరుధాన్యాల సాగుతో ఆహార భద్రత సాధ్యమని మహిళా రైతులు ఉద్ఘాటించారు. ప్రభుత్వాలు కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తుండడంతో చిన్న, సన్నకారు రైతులు కనుమరుగు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'చిరుధాన్యాలతో ఆహార సార్వభౌమత్వం' అనే అంశంపై శుక్రవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని పస్తాపూర్‌లో సదస్సు నిర్వహించారు. డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు సంగారెడ్డి, వరంగల్, వికారాబాద్, యాదాద్రి జిల్లాల నుంచి మహిళా రైతులు హాజరై వ్యవసాయంలో వస్తున్న మార్పులపై చర్చించారు. ఏటా విత్తనాలు వేసే సమయంలో వాతావరణ మార్పులు సంభవిస్తుండటంతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాతావరణ మార్పులను తట్టుకునే పంటల సాగుకు అవసరమైన విత్తనాల ఉత్పత్తిని ప్రభుత్వం ప్రోత్సహించాలని కోరారు. చిరుధాన్యాలకు మార్కెట్‌లో డిమాండ్ ఉన్నప్పటికీ దిగుబడి సరిగా లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి, వరి పంటల సాగును తగ్గించి చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని సూచించారు. జొన్న, సజ్జ, రాగి, అరికెలు, కొర్ర, కొడిసమ, వరిగ తదితర చిరుధాన్యాలకు మద్దతు ధర కలిపించాలని విజ్ఞప్తి చేశారు. పాత పంటలను పండించే రైతులకు రైతుబంధుతోపాటు రూ.10 వేల చొప్పున బోనస్ అందించాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో చిరుధాన్యాలకు ప్రాధాన్యమివ్వాలని, ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని అందజేయాలని కోరారు. చిరుధాన్యాలను ప్రాసెసింగ్ చేసేందుకు యంత్రాలను సమకూర్చాలని, సేంద్రియ ఎరువుల ఉత్పత్తి పెంచేందుకు ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై ఆవులు, బర్రెలు, మేకలను పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. సదస్సులో డీడీఎస్ డైరెక్టర్ డాక్టర్ రుక్మిణిరావు, ప్రముఖ జర్నలిస్టులు కే సజేయ, రమేశ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు నిమ్మయ్య, అమరేంద్ర, జహీరాబాద్ వ్యవసాయ శాఖ ఏడీఏ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛన్ పరిధిలోకి ఆ టీచర్లు

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : ఆలస్యంగా విధుల్లో చేరిన టీచర్లకు పాఠశాల విద్యాశాఖ నోషనల్ బెనిఫిట్స్‌ను వర్తింపజేస్తూ ఉత్తర్వులిచ్చింది. దీంతో వీరంతా సీపీఎస్ నుంచి పాత పింఛన్ పరిధిలోకి రానున్నారు. 2002 డీఎస్సీలో ఎంపికైన హిందీ భాషాపండితులు కొన్ని కారణాలతో 2008లో ఉద్యోగాల్లో చేరారు. వీరంతా 2002 నుంచి తమకు ప్రయోజనాలు కల్పించాలని కోర్టునాశ్రయించారు. వీరికి 17-10-2002 నుంచి నోషనల్ బెనిఫిట్స్, ఆర్థికలాభం విధుల్లో చేరిన తేదీ నుంచి ఇవ్వాలని కోర్టు తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో ఆయా టీచర్లంతా ఓపీఎస్ పరిధిలోకి రానున్నారు.

టీఆర్ఈఐ గురుకులాలకు రూ.6 కోట్లు విడుదల

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ గురుకులాలకు రూ. 6 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. 2023-24 విద్యాసంవత్సరానికి మూడో త్రైమాసిక నిధులను రిలీజ్ చేస్తూ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం జీవో విడుదల చేశారు.

ప్రణాళిక లేని ప్రజావాణితో ఇబ్బందులు

జాతీయ ఎంబీసీ సంఘాల సమితి కన్వీనర్ సత్యనారాయణ

హైదరాబాద్, డిసెంబర్22 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం శాస్త్రీయమై, పక్కా ప్రణాళిక లేకుండా హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంతో పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని జాతీయ ఎంబీసీ సంఘాల సమితి కన్వీనర్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాదర్బార్ నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, ప్రణాళిక లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో కూడా ప్రజావాణి నిర్వహించాలని కోరారు. సీఎం స్థాయిలో పరిష్కరించే సమస్యలనే ప్రజాదర్బార్‌కు ఆహ్వానించాలని తెలిపారు. సీఎం నిర్వహించే ప్రజావాణికి ఏ రోజున, ఏ జిల్లా, ఏ నియోజకవర్గాల ప్రజలు రావాలో నిర్ణయిస్తే సామాన్యులకు ఇబ్బందులు ఉండబోమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని సత్యనారాయణ కోరారు.

4 రాజ్యసభ సీట్లకు జనవరి 19న పోలింగ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 22: ఢిల్లీలోని 3 రాజ్యసభ సీట్లు, సిక్కింలోని ఒక రాజ్యసభ స్థానానికి వచ్చే ఏడాది జనవరి 19న ఎన్నికలు నిర్వహించనున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం తెలిపింది. ఆప్‌కు చెందిన ముగ్గురు ఎంపీలు సంజయ్ సింగ్, సుశీల్ కుమార్ గుప్తా, నరైన్ దాస్ గుప్తాల పదవీ కాలం వచ్చే ఏడాది జనవరి 27న, సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్ ఎంపీ హిస్‌హే లచుంగ్‌పా పదవీ కాలం ఫిబ్రవరి 23న ముగియనుంది. సంజయ్ సింగ్ ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.

చలికాలం అగ్ని ప్రమాదాలతో జాగ్రత్త

- **రాష్ట్రవ్యాప్తంగా 83 చోట్ల మాక్ డ్రిల్స్**

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): శీతాకాల అగ్నిప్రమాదాలపై తెలంగాణ అగ్నిమాపకశాఖ రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. చలిమంటలు, గ్యాస్ సిలిండర్ పేలుడు, గడ్డివాముల దగ్ధం వంటి ప్రమాదాలపై ఈ నెల 15 నుంచి 22 వరకు మొత్తం 83 ప్రాంతాల్లో మాక్‌డ్రిల్స్ నిర్వహించింది. ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు ప్రమాదం జరిగినప్పుడు చేయాల్సిన, చేయకూడని పనులను అగ్నిమాపక సిబ్బంది వివరించారు. అగ్ని ప్రమాదాలతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విపత్తులు సంభవిస్తే 101కు డయల్ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.